
# బీఆర్ఎస్ అంటే ఆత్మీయత.. కాంగ్రెస్ అంటే అహంకారం





గౌడ కులస్తులతో ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్, మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

- అరిగోస పెట్టేవాళ్లు అవసరమా?
- కాంగ్రెస్ పాలనలో గౌడ కులస్తులకు ఇబ్బందులు
- గౌడ కులస్తుల గౌరవాన్ని నిలబెట్టింది సీఎం కేసీఆరే..
- ఎమ్మెల్యే షకీల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి
- గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ కవిత

బోధన్, నవంబర్ 8: బీఆర్ఎస్ పార్టీ అంటే ఆత్మీయత అని, కాంగ్రెస్ అంటే అహంకారమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ రాక ముందు ఆంధ్రా పాలకులు గౌడ కులస్తులను అవమానాలకు గురిచేస్తూ అరిగోస పెట్టారని, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి కూడా కల్లు సొసైటీలను పునరుద్ధరించకుండా గౌడ కులస్తుల గోస పుచ్చుకున్నాడని ఆరోపించారు. బోధన్ పట్టణంలోని కౌండిన్య గౌడ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో హరితహారంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఐదు ఎకరాల్లో ఈత వనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈత చెట్లపై పన్నును రద్దు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహించామని తెలిపారు. అందరి మంచికోరే వ్యక్తి, ప్రజల ఆర్థికాభివృద్ధికి కృషి చేసేది కేసీఆరేనని పేర్కొన్నారు. కల్లు దుకాణాలకు అనుమతులిచ్చి 70వేల గౌడ కుటుంబాలకు ఉపాధి కల్పించామన్నారు. గత ప్రభుత్వాలు గౌడలకు ఎలాంటి ప్రోత్సాహం అందించలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ఈతవనాల పెంపకానికి అదనంగా భూమిని కేటాయిస్తామన్నారు.

ఎన్నికల సమయంలోనే సుదర్శన్‌రెడ్డి బయటికి వస్తాడని, కానీ బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్ ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటున్నాడని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో శాంతియుత వాతావరణం ఉండడంతో పెద్ద పెద్ద కంపెనీలు హైదరాబాద్‌లో పెట్టుబడి పెట్టేందుకు క్యూకట్టాయని, దీంతో 30లక్షల ఉద్యోగాలు వచ్చినట్లు వెల్లడించారు. పదేండ్ల క్రితం ఉమ్మడి జిల్లాలో బీసీలకు రెండు రెసిడెన్షియల్ హాస్టళ్లు ఉంటే, ప్రస్తుతం 23 హాస్టళ్లను ఏర్పాటు చేశామన్నారు. టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి.. విద్యార్థి నాయకులను అడ్డమీద కూలీలుగా అభివర్ణించారని, రైతులకు బిచ్చం వేస్తున్నారని అహంకారపూరితంగా వ్యాఖ్యానించినట్లు కవిత తెలిపారు. తెలంగాణ వచ్చే వరకు కాంగ్రెస్ పార్టీ గ్రామదేవతల ఆలయాలకు ఒక్క రూపాయి అయినా ఇచ్చారా? అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ గ్రామదేవతల ఆలయాల అభివృద్ధికి రూ.10లక్షలు ఇచ్చేలా కృషి చేశారన్నారు. మన కోసం పనిచేసే వ్యక్తులను ఎన్నికల సమయంలోనే గుర్తించవచ్చని, ఎన్నికల రోజు తప్పకుండా ఇండ్ల నుంచి బయటికి వచ్చి షకీల్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

### కేసీఆర్‌తోనే గౌడ కులస్తులకు ఆత్మగౌరవం : షకీల్

గౌడ కులస్తులకు సీఎం కేసీఆర్ హయాంలోనే ఆత్మగౌరవం పెరిగిందని బోధన్ ఎమ్మెల్యే షకీల్ అన్నారు. సైకిల్‌పై సారా మోసే వ్యక్తి.. గౌడన్నలను అడ్డం పెట్టుకొని కోట్ల రూపాయలు సంపాదించి గౌడన్నల పొట్టకొట్టారని ఆరోపించారు. కుల,మతాలకతీతంగా చిత్తశుద్ధితో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. తాను మరోమారు విజయం సాధిస్తే బోధన్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహంతోపాటు రూ.50లక్షలతో గౌడ భవనం నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. బోధన్‌లో నెలకొన్న టీఎఫ్‌టీ, నాన్ టీఎఫ్‌టీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని అన్నారు.

## ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

**నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్ వెల్లడి**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 8: శాసనసభ ఎన్నికల్లో భాగంగా జిల్లా పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ కల్మేశ్వర్‌తో కలిసి ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. 833 ప్రాంతాల్లో మొత్తం 1,549 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 7నాటికి రూపొందించిన ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 13,89,291 మంది ఓటర్లున్నారని, ఫారం-6, ఫారం-8 దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందని, వాటి పరిష్కారం అనంతరం తుది జాబితా ఖరారవుతుందని వెల్లడించారు. ఇప్పటి వరకు సీనియర్ సిటిజన్లు 889, దివ్యాంగులు 858 మంది ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఫారం-12 (డి) సమర్పించారని తెలిపారు. అత్యవసర సర్వీసుల పరిధిలోకి వచ్చే 13శాఖల ఉద్యోగులకు సైతం పోస్టల్ బ్యాలెట్ వెసులుబాటు కల్పించామన్నారు. ఈ నెల 15న ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఖరారు కానున్నారని, వారికి గుర్తులను కేటాయించి ఈవీఎంల రెండో విడుత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తిచేస్తామన్నారు. పీవోలు 1778 మంది, ఏపీవోలు 1774, వోపీవోలు 3599లు మొత్తం 7151 మందికి పోలింగ్ విధుల కోసం ర్యాండమైజేషన్ ద్వారా బాధ్యతలు కేటాయించామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.8940799 విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకున్నామని, రూ.3.80 కోట్ల నగదు, రూ.78.45 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులను సీజ్ చేశామన్నారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ ద్వారా పరిశీలన జరిపి సరైన ఆధారాలున్న వారికి రూ. 2.39 కోట్ల నగదును తిరిగి ఇచ్చామన్నారు. రూ.1.04కోట్ల పైచిలుకు నగదును ఐటీశాఖ అధికారులకు అప్పగించాలని తెలిపారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 260మంది రౌడీషీటర్లు, 41మంది కమ్యూనల్ రౌడీలు, గత ఎన్నికల్లో కేసులు నమోదైన 184 మందిని బైండోవర్ చేశామన్నారు. లైసెన్స్ కలిగిన 69 ఆయుధాలను డిపాజిట్ చేయించామని, భద్రతా దృష్ట్యా 23 తుపాకుల వినియోగానికి మాత్రమే అనుమతించామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, అదనపు డీసీపీ జయరాం పాల్గొన్నారు.

### దీపావళికి నాలుగు ప్రత్యేక రైళ్లు

సిటీబ్యూరో, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : దీపావళి పండుగ సందర్భంగా నాందేడ్-పాన్వెల్ రైల్వే స్టేషన్ల మధ్య నాలుగు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తూ రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 10 నుంచి 18 వరకు ఈ నాలుగు రైలు సర్వీసులు రాకపోకలు కొనసాగిస్తాయన్నారు. ఈ స్టేషన్ల మధ్యలో అధిక సంఖ్యలో ప్రయాణికులు ఉండడంతో నాలుగు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

## బీఆర్ఎస్ పాలనలో దళితులకు స్వర్ణయుగం

**దళిత కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, పక్కన ఆయన సతీమణి రజితారెడ్డి

నందిపేట్, నవంబర్ 8: బీఆర్ఎస్ పాలనలో దళితులకు స్వర్ణయుగమని ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. నందిపేట మండల కేంద్ర శివారులోని జీవనన్న ఎస్సీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన దళిత కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్‌ను దళిత పక్షపాతిగా అభివర్ణించారు. అంబేద్కర్ స్ఫూర్తితోనే తెలంగాణ సర్కారు పాలన సాగుతున్నదన్నారు. రాష్ట్రంలో మాల, మాదిగల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, పదేండ్లలో దళితుల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1,25,068కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా రూ.10లక్షల చొప్పున ఇచ్చే దళితబంధును తెలంగాణ ప్రభుత్వమే అమలు చేస్తున్నదన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సచివాలయానికి అంబేద్కర్ పేరు, ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా మహోన్నత విగ్రహాన్ని ప్రతిష్ఠించుకున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. నందిపేట్‌తోపాటు పెర్కిట్ రోడ్డు, మాక్లూర్ వద్ద కూడా దళితుల కోసం ఫంక్షన్ హాళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ దళితులు తన ఆత్మబంధువులని, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నానని, ఎస్సీ సోదరుల ఆత్మగౌరవం ఉట్టిపడేలా కమ్యూనిటీ హాళ్లు నిర్మించినట్లు చెప్పారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న దళిత కుటుంబసభ్యులు

